క్లుప్తంగా

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళా సంఘ సభ్యులు

జగిత్యాలరూరల్: మహిళలకు మహాలక్ష్మీ పథకం కింద ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం పట్ల శనివారం మండల సెర్ప్ కార్యాలయంలో శనివారం ఐకేపీ మహిళ సిబ్బంది సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత బస్సులతో మహిళలకు ఎంతో ఖర్చు తగ్గడంతో పాటు, మహిళలకు ఆర్థికంగా ఎంతో వెసులుబాటు కలుగుతోందన్నారు. అలాగే ఐకేపీ వీవోఏలకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు జారీ చేయడం వల్ల వారు చేసే పనులకు మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ మరియ, మంగ, సమాఖ్య సిబ్బంది పద్మ, వీవోఏలు జల, స్వప్న, రమ, జ్యోతి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన కౌన్సిలర్లు



ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌తో కౌన్సిలర్లు

జగిత్యాల: జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను హైదరాబాద్‌లో జగిత్యాల కౌన్సిలర్లు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. జగిత్యాల పట్టణ సమస్యలపై ఎమ్మెల్యేతో చర్చించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు తోట మల్లిఖార్జున్, పంబాల రాముకుమార్, చుక్క నవీన్, లక్ష్మణ్, జగన్మోహన్‌రెడ్డి, అడువాల లక్ష్మణ్ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

జగిత్యాల: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా మహిళ సాధికారత కో–ఆర్డినేటర్ అశ్విని అన్నారు. స్థానిక నవ్య కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు సాధికారత సాధించాలంటే అన్ని రంగాల్లో ఉండాలని, మహిళలకు సంబంధించిన హక్కులను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ శ్రీపాద నరేశ్, ఈశ్వర్ కుమార్ పాల్గొన్నారు.

ఆలయ భూముల్లో కట్టడాలు చేస్తే చర్యలు



అక్రమ కట్టడాలు కూల్చివేయిస్తున్న అధికారులు

జగిత్యాలరూరల్: ఆలయ భూముల్లో అక్రమ కట్టడాలు చేస్తే చర్యలు తప్పవని ఈవో వేణుగోపాల్ అన్నారు. శనివారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని మార్కెట్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గల హోటల్‌ను దేవాలయ స్థలం నుంచి తొలగించారు. అలాగే వాణీనగర్ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయం సర్వే నంబరు 171లో అక్రమ నిర్మాణాలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ దేవాలయ సమీపంలో ప్రహరీ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. దేవాదాయ భూముల్లో అక్రమ కట్టడాలకు సహించేది లేదన్నారు. ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈవో అనూష, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు ఉపాధి కల్పించాలి

రాయికల్: ప్రభుత్వం మహాలక్ష్మీ పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోతున్నారని, దీనికి నిరసనగా శనివారం రాయికల్ మండల ఆటో, జీపు, టాటామ్యాజిక్ ఓనర్స్, డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పాత బస్టాండ్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్కీంను తొలగించి ఉపాధి కల్పించాలని కోరారు. ఏఐటీయూసీ కోరుట్ల నాయకులు సుతారి రాములు, జగిత్యాల డివిజన్ ఆటో సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, ఆటో యూనియన్ మండల అధ్యక్షుడు సామల్ల ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

సారంగాపూర్: బీర్‌పూర్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఆటో, జీపు యజమానులు, డ్రైవర్లు రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో తమకు ఉపాధి నిలిచిపోయిందని శనివారం మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేసితహసీల్దార్ నరేశ్‌కు వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో నాయకులు రాజేందర్, కొమురయ్య, ఆడెపు మల్లేశం పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే మండల అభివృద్ధి

- చివరి సర్వసభ్య సమావేశంలో సర్పంచులు, ఎంపీటీసీల మనోగతం
- పదవులు లేకున్నా జనం మధ్యలో ఉంటామని వెల్లడి
- సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ తోట నారాయణ



సమావేశానికి హాజరైన సర్పంచులు,ఎంపీటీసీలు, అధికారులు

కోరుట్ల రూరల్: పల్లె ప్రజల సమస్యలు చర్చించి, ఆ సమస్యలు ప్రభుత్వానికి చేరవేసేందుకు మండల సర్వసభ్య సమావేశాలు చక్కగా తొడ్పడుతాయని కోరుట్ల మండల సర్పంచులు పేర్కొన్నారు. కోరుట్ల ఎంపీపీ తోట నారాయణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను సభ్యులకు చదివి వినిపించారు. సమావేశం సాదాసీదాగా జరిగింది. ఎంపీపీ తోట నారాయణ మాట్లాడుతూ ఐదేళ్లుగా మండల అభివృద్ధికి, సభ నిర్వహణకు సభ్యుల సహకారం మరువలేనిదని, తమ హయాంలో కోరుట్ల మండలానికి పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ అవార్డు దక్కటం సంతోషాన్నిచ్చిందన్నారు. జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య మాట్లాడుతూ సభ్యులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. వైస్ ఎంపీపీ చీటి స్వరూప మాట్లాడుతూ పదవులు శాశ్వతం కాదని పదవీకాలం ముగిసినప్పటికీ అందరం ప్రజల్లోనే ఉండాలన్నారు. ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామ సమస్యల పరిష్కారంలో సర్పంచుల కృషి కీలకమన్నారు. 2024 ఫిబ్రవరి 1 వతేదీతో సర్పంచుల పదవీ కాలం ముగియనుంది. దీంతో ఇదే చివరి మండల సమావేశం కావటంతో సర్పంచులు తమ పదవీ కాలంలోని అనుభవాలను సభలో పంచుకున్నారు. అవి వారి మాటల్లోనే..

చాలా సంతృప్తినిచ్చింది



గ్రామంలో ప్రజలు ఎదుర్కొనే సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించుకునేందుకు మండల సమావేశాలు సర్పంచులకు ఒక వేదికలా ఉపయోగ పడ్డాయి. ఈ ఐదేళ్ల కాలంలో మండల సమావేశం తనకు వ్యక్తిగతంగా సంతృప్తినిచ్చింది.

– సరికెల్ల మల్లారెడ్డి, సర్పంచ్, మోహన్‌రావుపేట

అధికారుల సహకారం మరువలేనిది



ఐదేళ్ల కాలంలో గ్రామాభివృద్ధికి అధికారులు అందించిన సహకారం మరువలేనిది. కొన్ని సమస్యలు మండల సభ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకున్నాం. ప్రజా సమస్యలపై పోరాడి ప్రజలకు న్యాయం చేశామనే సంతృప్తి మిగిలింది.

– గుగ్గిళ్ల తుక్కారాం గౌడ్, సర్పంచ్, యూసుఫ్‌నగర్

గ్రామాభివృద్ధే ధ్యేయంగా..



మొదటిసారి మా భార్య సర్పంచ్‌గా, రెండో సారి నేను సర్పంచ్‌గా గ్రామాభివృద్ధే ధ్యేయంగా పని చేశాం. తమ హయాంలో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశాం. దీనికి సహకరించిన అందరికీ కృతజ్ఞతలు. అధికారులు, తోటి సర్పంచుల సహకారం మరువలేనిది.

– చెప్యాల నర్సయ్య, సర్పంచ్ సంగెం

అవార్డు దక్కటం చాలా సంతోషాన్నిచ్చింది



ఈ ఐదేళ్ల కాలంలోనే మండలానికి కేంద్ర ప్రభుత్వ పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ అవార్డు దక్కటం చాలా సంతోషాన్నిచ్చింది. ఈ అవార్డు కింద రూ. 25 లక్షలు నగదు పారితోషికం అందింది. ఆ నిధులతో ఈ మండల సమావేశ మందిరం నిర్మించుకోవటం మరువలేనిది.

– దారిశెట్టి రాజేశ్, జిల్లా సర్పంచుల ఫోరం గౌరవ అధ్యక్షుడు

భవన నిర్మాణ కార్మికులకు పింఛన్ ఇవ్వాలి



సమావేశమైన ఏఐటీయూసీ నాయకులు

కోరుట్ల: రాష్ట్ర ప్రభుత్వం 58 ఏళ్లు నిండిన భవన నిర్మాణ కార్మికులందరికీ రూ.5000 పింఛన్ ఇవ్వాలని ఏఐటీయూసీ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు అన్నారు. పట్టణంలోని సీ.ప్రభాకర్ స్మారక గ్రంథాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. బోర్డు నుంచి గుర్తింపు పొందిన కార్డుదారులందరికీ 5 8 ఏళ్లు నిండితే వెంటనే రూ. 5 వేలు పింఛన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వచ్చే నెలలో డివిజన్ కేంద్రంలో పింఛన్ల సాధన కోసం సమావేశం నిర్వహిస్తామని, ఈ సమావేశానికి బీవోసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. ప్రవీణ్ హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ముక్రం, సీపీఐ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా నిలుస్తా

మల్యాల: మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు వొల్లాల నవీన్ గౌడ్ శనివారం మృతిచెందగా, కుటుంబ సభ్యులను చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరామర్శించి కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు. కుటుంబానికి అండగా నిలుస్తామని రవిశంకర్ భరోసానిచ్చారు. ఆయన వెంట మిట్టపల్లి సుదర్శన్, పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు ముల్క మల్లయ్య, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ.సుభాన్ ఉన్నారు.

అధికారులు వర్సెస్ ప్రజాప్రతినిధులు

- ఎమ్మెల్యే మార్నింగ్ వాక్ బాగుందన్న డీటీ
- అడ్డుచెప్పిన రేగుంట ఎంపీటీసీ
- వాడీవేడిగా మల్లాపూర్ మండల సమావేశం



డీటీ వ్యాఖ్యలపై కాంగ్రెస్, బీఆర్‌ఎస్ సభ్యుల వాగ్వాదం

మల్లాపూర్: మండల సమావేశం అధికారులు వెర్సెస్ ప్రజాప్రతినిధులు అన్నట్లుగా సాగింది. కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌కుమార్ చేపట్టిన మార్నింగ్ వాక్ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని డెప్యూటి తహసీల్దార్ శ్రావణి పదేపదే సూచించడం.. దానికి రేగుంట ఎంపీటీసీ గడ్డం శ్రీనివాస్‌రెడ్డి అడ్డుచెప్పడం.. ప్రతిగా బీఆర్‌ఎస్ సభ్యులు ఎదురుదాడికి దిగడం.. తనపై లేనిపోని ఆరోపణలు చేస్తే పరువునష్టం దావా వేస్తానని అనడంతో సమావేశం వాడీవేడిగా సాగింది. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కాటిపెల్లి సరోజన అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా అధికారులు తమతమ శాఖల పనితీరుపై వివరిస్తుండగా.. సభ్యులు అడ్డుచెప్పారు. అధికారుల అలసత్వంతో పనులు ముందుకు సాగడం లేదని, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్టీసీ సేవలపై సమీక్ష జరుగుతుండగా.. డీటీ శ్రావణి మాట్లాడుతూ ఎమ్మెల్యే చేపట్టిన మార్నింగ్‌వాక్ కార్యక్రమాన్ని పార్టీలకతీతంగా వినియోగించుకోవాలని సూచించారు. ఎమ్మెల్యేను సన్మానించాలని కోరారు. దీనికి కాంగ్రెస్ ఎంపీటీసీ అభ్యంతరం తెలిపి.. మండల అధికారిగా ఉండి ఎమ్మెల్యేకు అనుకూల ప్రచారం చేయడమేంటని ప్రశ్నించారు. శ్రావణికి మద్దతుగా బీఆర్‌ఎస్ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డితో వాగ్వాదానికి దిగారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. ఎంపీడీవో రాజ శ్రీనివాస్ సభ్యులను శాంతింపజేశారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను గ్రామాల్లో కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో జగదీశ్, వైస్ ఎంపీపీ గౌరు నాగేష్, కో–ఆప్షన్ సభ్యుడు ఎంఎ.సత్తార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఓటమితో కార్యకర్తలు అసంతృప్తి చెందొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింగరావు

మెట్‌పల్లి: ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమిపై కార్యకర్తలు అసంతృప్తికి గురి కావాల్సిన అవసరం లేదని ఆ పార్టీ నాయకులు జువ్వాడి నర్సింగరావు పేర్కొన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, తనకు మద్దతుగా నిలిచిన కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటానన్నారు. రాబోయే పార్లమెంట్, స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో ధర్మపురి దేవస్థానం కమిటీ మాజీ అధ్యక్షులు జువ్వాడి కృష్ణారావు, నాయకులు అల్లూరి మహేందర్‌రెడ్డి, జెట్టి లింగం, తిప్పిరెడ్డి అంజిరెడ్డి నర్సాగౌడ్, కొమిరెడ్డి లింగారెడ్డి తదితరులున్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

మల్లాపూర్ : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొప్పెల రవి అత్తమ్మ గడ్డం రాజు(65) అనారోగ్యంతో మృతి చెందగా, శనివారం ధర్మపురి ఆలయ కమిటి మాజీ చైర్మన్, పీసీసీ నాయకులు జువ్వాడి కృష్ణారావు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

మహిళా సంఘాలకు ఆర్థిక భరోసా కల్పించాలి

జగిత్యాలరూరల్: మహిళా సంఘాలకు ఆర్థిక భరోసా కల్పించాలని ఏపీఎం గంగాధర్ అన్నారు. శనివారం జగిత్యాల రూరల్ మండల సెర్ప్ కార్యాలయంలో వీవోఏలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్దేశించిన బ్యాంక్ లింకేజీ రుణాలు డిసెంబర్, జనవరి లోపు వందశాతం లక్ష్యం పూర్తి చేయాలన్నారు. సంఘాలు సక్రమంగా రుణాలు చెల్లించేలా చూడాలన్నారు. మహిళ రైతు సంఘాల ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ దేవయ్య, సీసీలు విద్యాసాగర్, గంగారాం, రవీందర్, మరియ, మంగ, మేనేజర్ రాణి పాల్గొన్నారు.

ఉద్యోగులకు త్వరలో పాత పెన్షన్

ధర్మపురి: పాత పెన్షన్ విధానానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రకటన చేయడంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యాయుడు మ్యాన పవన్‌కుమార్ ధన్యవాదాలు తెలిపారు. సీపీఎస్ రద్దు చేయాలని గత ప్రభుత్వానికి మొర పెట్టుకున్నా ఫలితం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వంతో సమస్య తీరే మార్గాలున్నాయని పేర్కొన్నారు.

కోరుట్లలో విజయ్ దివస్

కోరుట్ల: పట్టణంలోని కార్గిల్ చౌరస్తా వద్ద బీజేపీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి విజయ్ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా 1971 డిసెంబర్ 16న అమరులైన జవానులకు కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మాడవేణి నరేశ్, నాయకులు పోతుగంటి శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాసరావు, రాజేష్, తిరుమల వాసు,బీజేపీ, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి

కథలాపూర్: విద్యార్థులు ఇంటి వద్ద ఉదయం, సాయంత్రం వేళల్లో చదువుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కథలాపూర్ ఎంఈవో ఆనందరావు అన్నారు. శనివారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. తరగతి గదుల్లో విద్యార్థులకు టీచర్లు పాఠాలు బోధిస్తారని, హోంవర్క్ పూర్తి చేయించడంపై తల్లిదండ్రులు దృష్టిసారించాలన్నారు. పరీక్షల కోసం విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్లు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై ప్రజలకు అవగాహన

కోరుట్ల: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలపై పట్టణంలోని జగ్జీవన్‌రాం చౌరస్తా వద్ద శనివారం మున్సిపల్ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మాడవేణి నరేశ్, మోర్తాడ్ లక్ష్మీనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలలో మాక్ పోలింగ్

కోరుట్ల: పట్టణంలోని క్రిసెంట్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాస్వామ్యంలో ఓటు విలువ , ఓటుహక్కు వినియోగం తదితర అంశాలపై ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య ముఖ్య అతిథిగా హజరై మాక్ పోలింగ్‌లో పాల్గొని ఓటు వేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ యాటం పద్మ, హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధిగా లక్ష్మీరాజం

కథలాపూర్: ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధిగా కథలాపూర్ మండలం చింతకుంట గ్రామానికి చెందిన కాశవత్తుల లక్ష్మీరాజంను నియమించామని జిల్లా ఇన్‌చార్జి గందం నాగభూషణం శనివారం పేర్కొన్నారు. లక్ష్మీరాజం ఇన్నాళ్లు ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ విభాగంలో మండలంలో వివిధ బాధ్యతలు నిర్వహించారు. నియోజకవర్గ కన్వీనర్‌గా సేవలందించారు. అతని సేవలను గుర్తించి జిల్లా అధికార ప్రతినిధిగా నియమించినట్లు ఆయన తెలిపారు. లక్ష్మీరాజం నియామకం పట్ల ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు వినోద్, నిఖిల్, కిరణ్, రాజు, ప్రభు హర్షం వ్యక్తం చేశారు.


బస్ ట్రిప్పులు పెంచాలని డీఎంకు వినతి

కోరుట్లరూరల్: మండలంలోని చిన్నమెట్‌పల్లి, యూసుఫ్‌నగర్ గ్రామాలకు ఆర్టీసీ బస్ ట్రిప్పులు పెంచాలని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు డిపో మేనేజర్‌కు శనివారం వినతి పత్రం సమర్పించారు. గ్రామానికి అదనపు ట్రిప్పులు వేయాలని యూసుఫ్‌నగర్ సర్పంచ్ గుగ్గిళ్ల తుక్కారాం గౌడ్, చిన్నమెట్‌పల్లి ఎంపీటీసీ పంచిరి విజయ్ డీఎంకు వినతి పత్రం ఇచ్చారు.

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

ఇబ్రహీంపట్నం: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని హెల్త్ సూపర్‌వైజర్ హేమలత అన్నారు. శనివారం మండలంలోని యామాపూర్‌లో గ్రామ పంచాయతీ వద్ద గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్‌లు హేమలత, సుశీల ఆశావర్కర్లు అంగన్‌వాడీ టీచర్, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

అంతా మహాలక్ష్మి మాయ..



మహిళలతో కిక్కిరిసిన ధర్మపురి బస్టాండ్

ధర్మపురి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకానికి భారీ స్పందన లభిస్తోంది. ఆరు గ్యారంటీల్లో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల కోసం మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టి రాష్ట్ర వ్యాప్తంగా ఉచితంగా ప్రయాణించే సౌకర్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆర్టీసీ బస్సుల్లో పల్లె వెలుగుతో పాటు ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో కండక్టర్ ఇచ్చే జీరో టికెట్‌తో ఉచిత ప్రయాణం చేస్తున్నారు. ఉచిత ప్రయాణంతో గ్రామాల్లో పట్టణాల్లో మహిళ రద్దీ ఎక్కువ ఉంది. బస్సులు, బస్టాండులు మహిళలతో కిక్కిరిసి పోతున్నాయి. గతంలో ఎన్నడూ లేనటువంటి మహిళల ప్రయాణం కనిపిస్తోంది. శనివారం ధర్మపురి బస్టాండ్ మహిళలతో కిక్కిరిసి పోయింది.

ఇందిరమ్మ ఇళ్లలో పేద వర్గాలకు మొదటి ప్రాధాన్యత



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

సారంగాపూర్: ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో నిరుపేద వర్గాలకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని బీర్‌పూర్ ఎంపీపీ మసర్తి రమేశ్ అన్నారు. బీర్‌పూర్ మండల సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ మహాలక్ష్మీ పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణం ప్రారంభించడం సంతోషమని, బీర్‌పూర్ మండలం మంగేళ నుంచి ధర్మపురికి ఆర్టీసీ బస్సు నడిపించాలని కోరారు. ఎంపీపీ మసర్తి రమేశ్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో మొదటి ప్రాధాన్యత ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఉంటుందని, పేద వర్గాలకు ముందుగా మంజూరు చేస్తామన్నారు. కొల్వాయి సొసైటీ చైర్మన్ పొల్సాని నవీన్‌రావు మాట్లాడుతూ బీర్‌పూర్ మండలంలోని పలు గ్రామాల్లో మహిళా సంఘాల్లోని డబ్బులు దుర్వినియోగం జరిగినట్లు ఫిర్యాదు చేసారని, దీనిపై విచారణ ఎంత వరకు వచ్చిందని ప్రశ్నించారు. దీనికి ఏపీఎం రాజయ్య వివరణ ఇస్తూ ఈ విషయంపై పూర్తి నివేదిక ఉన్నతాధికారులకు పంపినట్లు, దీనిపై త్వరలో నిర్ణయం వెలువడుతుందన్నారు. కొల్వాయి గ్రామ పంచాయతీలో నిధులు దుర్వినియోగం జరిగినట్లు ప్రజలు ఫిర్యాదు చేసారని, దీనిపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారో వివరించాలని కొల్వాయి ఎంపీటీసీ రంగు లక్ష్మణ్ డిమాండ్ చేశారు. మిషన్‌భగీరథ అధికారులు సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ బీర్‌పూర్ భారీ రక్షిత మంచినీటి పథకం పునరుద్ధరణ కోసం అంచనాలు రూపొందించి ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిపారు. తహసీల్దార్ నరేశ్, ఎంపీడీవో రాజేందర్, అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

దుష్ప్రచారం చేసిన వారిపై చర్యలు

మేడిపల్లి: భీమారం మండలంలోని మన్నెగూడెం నాగులమ్మ ఆలయంలో అన్యమతస్తులు ఆకుపచ్చ జెండాలు కట్టారని ఒక వీడియో నిన్న సోషల్ మీడియాలో హల్చల్ చేయగా, అది తెలుసుకున్న మేడిపల్లి ఎస్సై శ్యామ్ రాజ్, లా అండ్ ఆర్డర్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. సర్పంచ్ సింగిరెడ్డి నరేశ్ రెడ్డి గ్రామస్తులతో గుడి ఆవరణలో ఆకుపచ్చ జెండాలను ఎందుకు ఉంచారని విచారణ చేయగా, హిందూ సాంప్రదాయంలో భాగంగా పక్కనే ఉన్న దర్గాలో హిందువులు పూజలు చేసి అక్కడ ఆకుపచ్చ జెండాలు పెడతారని గ్రామస్తులు తెలిపారు. ఇది ఎన్నో ఏళ్ల నుంచి జరుగుతుందని గ్రామస్తులు తెలిపారు. పూర్తి విషయాలు తెలుసుకోకుండా మతాల మధ్య ఘర్షణలు సృష్టించే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వ్యక్తి పై చర్యలు తీసుకోవాలి

ఇబ్రహీంపట్నం: మండలంలోని కేశాపూర్ శివారులోని సర్వే నెంబర్ 87 లో ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన లక్కం శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు తహసీల్దార్ ప్రసాద్‌కు విన్నవించారు. కార్యక్రమంలో సర్పంచ్ దాసరి పోశెట్టి, నల్లెంకు వెంకట్, భూమేశ్, పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యతో పిల్లల్లో మానసిక అభివృద్ధి

జగిత్యాలరూరల్: పూర్వ ప్రాథమిక విద్య ద్వారానే పిల్లల్లో సృజనాత్మకాభివృద్ధి కలుగుతుందని ఐసీడీఎస్ రూరల్ సూపర్‌వైజర్ లావణ్య అన్నారు. శనివారం జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి అంగన్‌వాడీ కేంద్రం–2లో చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. మూడేళ్లు దాటిన పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారం అందించి ఆటపాటల విద్యను నేర్పిస్తామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ పద్మరాణి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

పెగడపల్లి: మండలంలోని అయితిపల్లి శివారు ఎస్సారెస్పీ ప్రధాన కాలువ పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేసి కాపర్‌వైరును ఎత్తుకెళ్లారు. విద్యుత్ మోటార్లు నడవకపోవడంతో రైతులు ట్రాన్స్‌ఫార్మర్ వద్దకెళ్లి చూశారు. రైతుల సమాచారం మేరకు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్, లైన్‌మన్ భిక్షపతి ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ఇబ్రహీంపట్నం: మండలంలో నాలుగు ఇసుక ట్రాక్టర్లను శనివారం పోలీసులు పట్టుకున్నారు. మల్లాపూర్ మండలంలోని మొగిలిపేట నుంచి ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను యామాపూర్ వద్ద, కోమటికొండాపూర్ నుంచి ఇసుకను రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను ఇబ్రహీంపట్నం వద్ద పట్టుకున్నట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు.

పాఠశాలకు వాటర్ ప్యూరిఫైర్ అందజేత

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలకు 1998–1999 బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు రూ.22 వేల విలువ గల వాటర్ ప్యూరిఫైర్‌ను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నేమూరి లత, ఎంపీటీసీ తిమ్మని రాములు హెచ్ఎంలు వాణి,రాజన్న, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖతార్‌లో రక్తదాన శిబిరం

బుగ్గారం: అంతర్జాతీయ వలసదారుల దినోత్సవం , ఖతార్ నేషనల్ డే సందర్భంగా ధర్మపురి నియోజకవర్గానికి చెందిన పలువురు ఎన్నారైలు,తెలంగాణ గల్ఫ్ సమితి అధ్యక్షుడు మైదం మధు ఆధ్వర్యంలో ఖతార్‌లో మహా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భారత రాయబార కార్యాలయ సెక్రటరీ డా.వైభవ్‌తండలే, ఐసీబీఎఫ్ అధ్యక్షుడు షానవాజ్, ఐసీసీ ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం, నాయకులు పాల్గొన్నారు.